తాగునీరు సురక్షితమేనా!


నిర్వహణ లేక కళ తప్పిన ఓవర్ హెడ్ ట్యాంకు

జీవీఎంసీ అందిస్తున్న తాగునీరు సురక్షితమేనా!.. ప్రతి ఇంటికీ అందుతున్న మున్సిపల్ నీరు నాణ్యమైనదేనా!.. పైప్‌లైన్ల నిర్వహణలో, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల మెయింటెనెన్స్‌లో అధికారులు ప్రమాణాలు పాటిస్తున్నారా!.. ఇప్పుడు ఇలాంటి ప్రశ్నలే ఉత్పన్నమవుతున్నాయి.

నీటిని శుద్ధి చేసిన ప్లాంట్‌లో పరీక్షలు చేయకుండానే కుళాయిలకు చేరుకొనే పాయింట్ల వద్ద నీటి నాణ్యత ఎంత అనే విషయంలో అధికారుల పర్యవేక్షణ ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఒక ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో చిన్నారులు దిగి ఈత కొట్టడం తెలిసిందే. నీటి శుభ్రత లేకపోవడం వల్ల ఐదు నెలల కిందట గాజువాకలో డయేరియా ప్రబలింది. పైప్‌లైన్లు కూడా మురుగులో కలిసిపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – గాజువాక



తాగునీటి నాణ్యతను నిర్ధారించడానికి ఎక్కడికక్కడ నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు జరపాలి. గాజువాక జోన్‌లో అలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలే కనిపించని పరిస్థితి ఉంది. ఫలితంగా తాగునీటిలో కలుషిత జలాలు చేరి జనం ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

కాలువల్లోనే తాగునీటి పైప్‌లైన్లు


గాజువాకలో జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్లు అధికశాతం మురుగునీటి కాలువల్లో, కాలువలను ఆనుకొని ఉన్నాయి. అనేక సందర్భాల్లో ఈ పైప్‌లైన్లకు రంధ్రాలు ఏర్పడి తాగునీరు కలుషితమవుతోందని జీవీఎంసీ అధికారులకు తరచూ ఫిర్యాదులు అందుతున్న విషయం తెలిసిందే. నీరు రంగు మారిపోవడం, దుర్వాసన వెదజల్లడం వంటి ఫిర్యాదులు జోనల్ అధికారులు అందుతున్నాయి. గాజువాక పట్టణంలో 30 ఏళ్ల కింట వేసిన పైపులే ఇప్పటికీ ఉన్నాయి. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరడంతో తరచూ లీకైపోతున్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా నిర్వహించడం తప్ప శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. పైప్‌లైన్ లీకవుతున్నట్టు ఫిర్యాదు వస్తే నాలుగు రోజుల తర్వాత గాని సిబ్బంది స్పందించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని జనం కోరతున్నారు.

ట్యాంకుల నిర్వహణపై అనుమానాలు

ఐదు నీటి ప్రాజెక్టులున్న గాజువాక జోన్‌లో మొత్తం 58,028 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వాటి ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి పది ఓవర్ హెడ్ ట్యాంకు (ఓహెచ్‌టీ)లను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ విషయంలో అధికారులు అలక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాటికి రక్షణ కూడా కల్పించలేని పరిస్థితి కనిపిస్తోంది. వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో 64వ వార్డులోని ఒక ట్యాంక్‌లో చిన్నారులు దిగి ఈత కొట్టిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో నీటి నాణ్యతపై జనం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉన్నప్పటికీ ఎక్కువ మంది ఆర్వో నీటిని కొనుగోలు చేసి తాగుతున్నట్టు తెలుస్తోంది. అధికారులు ఈ విషయంలో అప్రమత్తమై ప్రజలకు నమ్మకం కలిగించాలని కోరుతున్నారు.


64వ వార్డు వాంబేకాలనీ ఓహెచ్‌టీలో ఈతకు దిగిన చిన్నారి (ఫైల్)


వడ్లపూడి గెడ్డలోని మురుగునీటిపై తేలుతున్న తాగునీటి పైప్‌లైన్


దయాల్‌నగర్ కొండపై శిథిలమైన ఓవర్‌హెడ్ ట్యాంకు పైకప్పు

భయపడాల్సిన అవసరం లేదు

జీవీఎంసీ అందిస్తున్న రక్షిత తాగునీటి విషయంలో ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదు. నీటి సరఫరాలో అన్ని ప్రమాణాలు పాటిస్తున్నాం. ప్రతి మూడు నెలలకు ఓహెచ్‌టీలను కూడా శుభ్రం చేస్తాం. చిన్నారులు ఓహెచ్‌టీలో స్నానం చేసిన ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత మరింత అప్రమత్తమయ్యాం. పైకప్పులకు తాళాలు కూడా ఏర్పాటు చేశాం. సిబ్బంది కొద్దిపాటి అలక్ష్యం ప్రదర్శించడంతో ఇటీవల ఒకటి రెండు సంఘటనలు జరిగాయి. మళ్లీ పునరావృతం కావు.

– పి.కేదార్‌నాథ్, వాటర్ సప్‌లై సహాయ ఇంజినీర్, గాజువాక

ప్రతి పాఠశాలలో ధరిత్రి దినోత్సవం నిర్వహించాలి


శిష్టు ఖగేశ్వరరావు, ఏపీఎన్‌జీసీ అనకాపల్లి జిల్లా కోఆర్డినేటర్

అగనంపూడి: మనిషి ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవనంలో పర్యావరణం ప్రధాన పాత్ర పోషిస్తుందని ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు అన్నారు. వీటిపై అవగాహన కల్పించేలా ఈ నెల 22న ధరిత్రి దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని కోరారు. లంకెలపాలెంలో ఆయన మాట్లాడుతూ ప్రాణకోటికి జీవనాధారం పర్యావరణం అనే విషయంలో విద్యార్థి దశలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పాఠశాల ఆవరణలోని మొక్కలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసికి అలాట్ చేయాలని ఆయన సూచించారు. పాఠశాల ఎకో క్లబ్‌లు, ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను భాగస్వాములు చేయాలని కోరారు.

మద్యం ఎక్కువైతే కాలేయ వ్యాధుల ముప్పు


డాక్టర్ చలపతిరావు

అక్కిరెడ్డిపాలెం: మద్యం ఎక్కువగా తీసుకునే వారిలోనే కాలేయ వ్యాధులకు గురవుతారని శీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పటల్ చీఫ్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఇంటర్వెనల్ ఎండోస్కోపీ అండ్ లివర్ ట్రాన్స్ ప్లాంట్ విభాగం వైద్యుడు డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. ఈ నెల 19న ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆస్పత్రిలో కాలేయ వ్యాధులకు గురవ్వడానికి, ప్రబలడానికి గల కారణాలు, కాలేయ వ్యాధిని ఎలా గుర్తించాలి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కాలేయ సమస్యలు ఉన్న వారు ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి, హెపటైటిస్ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల ఉపయోగాలు, కాలేయం గురించి పలు అపోహలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

రామాలయ వార్షికోత్సవాలు ప్రారంభం


పూజల్లో పాల్గొన్న గ్రామ కమిటీ పెద్దలు

గాజువాక: పాతకర్ణవానిపాలెంలోని రామాలయ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక హోమాలు, మహారుద్రాభిషేకం, వల్లీదేవసేన శుబ్రమణ్య స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్టు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. ఆలయ అర్చకులు రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు భక్తులకు ఆశీర్వచనాలు అందజేసి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు సిరసపల్లి అప్పారావు, వెంకటలక్ష్మి, గణేష్ శర్మ, ఆదియ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్యాన జ్ఞాన యజ్ఞం విజయోత్సవాలు


విజయోత్సవాల్లో పాల్గొన్న పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక స్టీల్‌క్లబ్‌లో శుక్రవారం వశిష్ట గౌతమి ఉగాది ధ్యాన జ్ఞాన యజ్ఞ విజయోత్సవాలు ఘనంగా జరిగాయి. పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రేవతీదేవి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర పిరమిడ్ మాస్టర్ సమక్షంలో జరిగాయి. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రత్నకుమారి, శివగణేశ్వరరావు, మోహన్, లక్ష్మి, స్టీల్‌ప్లాంట్ వర్మ, సతీష్, శివ, బాలాజీ, రామకృష్ణరాజు, అప్పారావు, వశిష్ట గౌతమి ట్రస్ట్ సభ్యులు విజయభాస్కరరెడ్డి, అనంతలక్ష్మి, రంగారావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు చిత్రలేఖనం పోటీలు

మద్రిపాలెం: ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముకుందరావు తెలిపారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో శుక్రవారం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 7వ తరగతి వరకు జూనియర్లుగా, ఇంటర్ వరకు విద్యార్థులను సీనియర్లుగా పరిగణిస్తామని, పోటీలో పాల్గొనే వారికి కేవలం డ్రాయింగ్ షీట్లు మాత్రమే అందజేస్తామన్నారు. ఇతర చిత్రలేఖన సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అవర్ పవర్-అవర్ ప్లానెట్ థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనే వారు.. మరిన్ని వివరాలకు 83338 49955ను సంప్రదించవచ్చు. సమావేశంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ప్రభుత్వ విప్ గణబాబు శుక్రవారం గోపాలపట్నం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న ఈ మెగా జాబ్ మేళాలో పలు ప్రముఖ ఐటీ కంపెనీలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ , హాస్పిటల్ రంగానికి చెందిన దాదాపు 53 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు.

మత్స్యకారుల ఎన్యుమరేషన్ పూర్తి

మహారాణిపేట: చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే వేట నిషేధ భృతి కోసం శుక్రవారం ఎన్యుమరేషన్ పూర్తి చేశారు. జిల్లాలోనిని 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో మత్స్యశాఖ జేడీ ఎ.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, సచివాలయ ఫిషరీస్ కార్యదర్శులు, సాగర్ మిత్రాలు సర్వేలు నిర్వహించారు. ఏటా వేట నిలుపుదల చేసిన తర్వాత ఎన్యుమరేషన్ నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా నిర్వహించిన ఈ గణనలో అన్ని రకాలకు చెందిన మొత్తం 1,197 బోట్లను, 12వేల మంది మత్స్యకారుల వివరాలు నమోదు చేశారు. బోట్లకు, మత్స్యకారులకు ఫొటోలు తీశారు. ప్రతీ మత్స్యకారుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, బోటు లైసెన్స్ జిరాక్స్ కాపీలను సచివాలయంలో గానీ మత్స్యశాఖ సిబ్బందికి గానీ ఇచ్చి వేట నిషేధ భృతి కోసం పేర్లు నమోదు చేసుకోవాలని జేడీ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో డెమో ఇస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక జిల్లా అధికారి ఎస్ గోపీకృష్ణ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థలో ఉద్యోగులకు గ్యాస్ ప్రమాదాల నియంత్రణపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు వెంటనే విద్యుత్ స్విచ్‌లు ఆన్ చేయకూడదని, అగ్గిపుల్లలు, గ్యాస్ లైట్లు వెలిగించకూడదన్నారు. కిటికీలు తీసి గ్యాస్ బయటకు వెళ్లిపోయే వరకూ ఏ విధమైన అగ్గి రాజేయకూడదన్నారు. గ్యాస్ మంట బయటకు వస్తే వెంటనే తడి గోనె సంచె కప్పితే మంటలు అదుపులోకి వస్తాయన్నారు. ఆ తర్వాత గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను కట్టివేయాలని చెప్పారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తులను ఎలా రక్షించాలో ప్రయోగాత్మకంగా ప్రదర్శన చేసి చూపించారు. సిబ్బంది స్వామినాయుడు, తారకేశ్వరరావు, రమేష్, రెడ్డి నాయుడు, మంగునాయుడు పాల్గొన్నారు.

గ్రామ సింహాల స్వైర విహారం


వ్యాధి బారిన పడిన వీధికుక్క


వుడానగర్‌లో సంచరిస్తున్న వీధికుక్కలు

పట్టించుకోని ప్రజారోగ్య విభాగం అధికారులు

కూర్మన్నపాలెం: వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మరికొన్నింటి వ్యాధులు సోకాయి. అవి కూడా విచ్చలవిడిగా సంచరించడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అయినా ప్రజారోగ్య విభాగం అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా రాజీవ్ నగర్,వుడానగర్ -ఫేజ్ 1లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో అయితే ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. ఎటువైపు నుంచి ఏ కుక్క వచ్చి మీదపడుతుందన్న భయంతో వణికిపోతున్నారు. అలాగే రోగాలు భారిన పడిన కుక్కల సంచారం ఎక్కువగా ఉండడంతో తామెక్కడ అనారోగ్యానికి గురవుతామోనన్న భయం కూడా ప్రజల్లో ఉంది. కుక్కలకు వ్యాక్సిన్ వేయాలని సంతానోత్పత్తిని తగ్గిస్తామని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ప్రధాన వైద్యాధికారి వెల్లడించారు. కాని గాజువాక జోన్‌లో ఆ ఆదేశాలు ఏవీ అమలు కాలేదు. దీంతో కుక్కల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకొని కుక్కలను నిరోధించాలని వుడానగర్ వాసులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


వుడా కాలనీలో లివింగ్ క్రైస్ట్ చర్చిలో ప్రార్థనలు

పెదగంట్యాడ: గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మారనాథ పెంతెకోస్టల్ మిషన్స్ (ఎంపీఎం) సొసైటీ సీయోను ఆరాధన కేంద్రం అధ్యక్షుడు పాస్టర్ కేతా శాంసన్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని పెదగంట్యాడ కూడలి వద్ద గ్రామ పెద్దలు గంట్యాడ గురుమూర్తి, గొందేశి మహేశ్వర రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి శ్రీదేవి, నాయకులు పులి రమణారెడ్డి, పులి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• వినాయకనగర్ వుడా కాలనీలో లివింగ్ క్రైస్ట్ చర్చి పాస్టర్లు కె.శాంసన్, ఆరోన్‌జాన్ సుజిత్ ఆధ్వర్యంలో వుడాకాలనీలో శాంతి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ లోకరక్షణ కోసం ఏసు శిలువలో మరణించారని, మానవాళి శాంతి కోసం పరలోకం నుంచి ఏసు భూలోకానికి దిగి వచ్చారన్నారు.

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: ఉక్కునగరం, సమీప చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు ఎంతో నిష్ఠగా ఆచరించే శ్రమకాలం చివరి దినాల్లో క్రీస్తు లోకపాపం పరిహారం నిమిత్తం శిలువను మోస్తూ పలికిన ఏడు మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుని ఆయన పొందిన శ్రమలను మననం చేసుకుంటూ ప్రార్థనలు చేశారు. ఉక్కునగరంలోని ఆర్‌సీఎం చర్చి, క్రైస్ట్ ది సేవియర్ చర్చి, లూథరన్ దేవాలయం, ది అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిల్లో ఆయా ఫాదర్లు గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు.


దుర్గవానిపాలెంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏసు ప్రేమికులు

రామ్‌నగర్‌లో..

అక్కిరెడ్డిపాలెం: రాంనగర్‌లోని యునైటెడ్ ఇమాన్యుయల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ డాక్టర్ జాకబ్ ఎ.ఎస్.కుమార్, పి.జె.భాస్కరరావు, రోసీ ఈవెలన్ రాయ్, అధ్యక్షుడు జి.మిలన్, కార్యదర్శి ఎస్.డేవిడ్ జెమ్స్ రాయ్, కోశాధికారి కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రాంనగర్ యునైటెడ్ ఇమాన్యుయల్ చర్చిలో ప్రార్థనలు


ఉక్కునగరం చర్చిలో శిలువతో ప్రార్థన


ఉక్కునగరం సేవియర్ చర్చి ఆధ్వర్యంలో శిలువ మార్గం పాటిస్తున్న భక్తులు

ఇంద్రకాలనీలో కార్డన్ సెర్చ్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి 66వ వార్డు ఇంద్రకాలనీలో గాజువాక పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం గాజువాక ఎస్ఐలు టి.రవికుమార్, నజీర్‌ల సారథ్యంలో సుమారు 25 మంది సిబ్బంది కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంట్లో కుటుంబ సభ్యుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం నిల్వలు ఉన్నాయోమనని పరిశీలించారు. ఐదు వాహనాల రికార్డులు సరిగా లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. తర్వాత యజమానులు రికార్డులను ఎస్ఐలకు సమర్పించడంతో యజమానులకు అప్పగించారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రవికుమార్

తాటి ముంజెలు వచ్చేశాయ్


తాటికాయల నుంచి ముంజెలు తీస్తున్న గీత కార్మికుడు


తాటిముంజెలు కొనేందుకు వేచి ఉన్న స్థానికులు

పెదగంట్యాడ: వేసవి తాపం నుంచి ఉపశమనాన్ని అందించే తాటి ముంజెలు వచ్చేశాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో వీటిని జోరుగా విక్రయిస్తున్నారు. ఏటా వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజెలంటే ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో.. పకృతి వర ప్రసాదంగా లభించే ఈ ముంజెలు రుచి అమోఘంగా ఉంటుంది. అందులోని నీరు తాగుతుంటే ఆ మజాయే వేరబ్బా..! మండలంలోని పెదగంట్యాడ జంక్షన్‌తో పాటు బీసీ రోడ్డులోని వికాస్‌నగర్ జంక్షన్, చైతన్య కళాశాల సమీపంలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల తర్వాత తాటికాయలు తీసుకు వచ్చి.. అక్కడే వాటిలోని ముంజెలను తీసి తాజా తాజాగా విక్రయిస్తున్నారు. డజను రూ.50 నుంచి రూ.60 వరకూ అమ్ముతున్నారు. అలాగే ఒక్కో కాయ రూ.10 వంతును విక్రయిస్తున్నారు. తాటి కాయలతో పాటు ముంజెలకు భలే గిరాకీ ఏర్పడడంతో విజయనగరం జిల్లాలోని శృంగవరపు కోట, లక్కవరపు కోటకు చెందిన కొన్ని కుటుంబాలు ఏటా వేసవిలో గాజువాక పరిసర ప్రాంతాలకు వచ్చి తాటిచెట్ల నుంచి వీటిని సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నారు.

ప్రతి ఏటా వస్తాం



విజయనగరం జిల్లాలోని శృంగవరపు కోట, లక్కవరపు కోటకు చెందిన మేము మా కుటుంబాలతో పాటు ప్రతి ఏటా వేసవిలో గాజువాక ప్రాంతానికి వస్తాం. చుట్టు పక్కల దువ్వాడ, స్టీల్‌ప్లాంట్, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో తాటి చెట్ల నుంచి తాటికాయలను సేకరించి గాజువాక, పెదగంట్యాడ, టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తుంటాం.

–బత్తిన సింహాద్రి, తాటి ముంజెల విక్రయదారు, లక్కవరపు కోట,